క్లుప్తంగా

బీటీ పనులు ప్రారంభం



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలం నాగసానిపల్లి నుంచి వెంకటాపురం వరకు రూ.86 లక్షల ఎంఆర్ఆర్ నిధులతో చేపట్టే బీటీ రహదారి పనులను సర్పంచ్ ఆంజనేయులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు నాణ్యతగా త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి నిరంజన్‌రెడ్డికి గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి జీవిత, ఏఈ రమేష్‌నాయుడు, గ్రామస్తుడు చిరంజీవి పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు




ఆత్మకూర్: జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతి ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు క్షేత్ర, లక్ష్మిఅవినాష్‌రెడ్డి ఎంపికయ్యారని లిటిల్ ఫ్లవర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు మీర్జా అన్వర్ బేగ్, మీర్జా అక్తర్‌బేగ్ గురువారం తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, అధ్యాపకులు, స్థానికులు అభినందించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌కు చెందిన శివశంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు 2001–2002 సంవత్సరం పదోతరగతి విద్యార్థులు రూ.40 వేలు పోగుచేసి గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్నేహితులు లక్ష్మణ్, నందన్, ఎల్లయ్య, విఠల్, రమేష్‌నాయక్, విష్ణు, రామ్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పరిశీలన



పాన్‌గల్: ఓటరు నమోదుపై బీఎల్వోలు చేపడుతున్న ఇంటింటి సర్వేను గురువారం మండలంలోని అన్నారంతండాలో తహసీల్దార్ చక్రపాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు కంటె ఎక్కువ ఓటర్లున్న ప్రతి ఇంటిని పరిశీలించి వాస్తవాలు తేల్చాలని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా బీఎల్వోలు ఇంటింటి సర్వే చేపడుతున్నారని వివరించారు. అలాగే ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు వంటి విషయాలను కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. బీఎల్వో నిర్మల తదితరులు ఉన్నారు.

బాలామృతంతో సంపూర్ణ ఆరోగ్యం



అమరచింత: ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న బాలామృతంతో చిన్నారుల్లో ఎదుగుదలతో పాటు బరువు పెరిగే అవకాశం ఉందని అంగన్‌వాడి టీచర్ రాధిక అన్నారు. పట్టణంలోని నాలుగో అంగన్‌వాడి కేంద్రంలో గురువారం చిన్నారుల తల్లులకు బాలామృతంపై అవగాహన కల్పించారు. కొత్తగా బాలామృతం ప్లస్ ప్యాకెట్లు వచ్చాయని తెలిపారు. క్రమం తప్పకుండా చిన్నారులకు అందించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలం నాగరాల–1 కేంద్రంలో కేశపాగ పెద్దసాయిలు అనారోగ్యంతో బుధవారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివగౌడ్, మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీహరిరాజు గురువారం స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆశన్న, ప్రవీణ్‌కుమార్, చందు, ఎండీ జావీద్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాల ఫలితమే ప్రత్యేక రాష్ట్రం



పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లిలో..



గోపాల్‌పేటలో..

కొత్తకోట: అమరుల త్యాగాల ఫలితమే ప్రత్యేక రాష్ట్రమని, వారి త్యాగాలు మరిచిపోలేనివని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న అమరుల స్తూపం వద్ద ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ కొరకు ఆత్మ బలిదానం చేసుకున్న మిరాసిపల్లికి చెందిన కావలి సువర్ణ తల్లి రాములమ్మ, కొత్తకోటకు చెందిన దాసరి నరేష్ తల్లి చెన్నమ్మను ఆయన శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, పి.విశ్వేశ్వర్, ఆకుల శ్రీనివాసులు, గాడీల ప్రశాంత్, కె.శ్రీనివాస్‌జీ, గుంత మల్లేష్, అల్లబాషా, ఎంపీడీఓ, తహసీల్దార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ మేఘారెడ్డి జెడ్పీటీసీ సభ్యుడు రఘుపతిరెడ్డి, వైస్‌ఎంపీపీ రఘుప్రసాద్ అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీటీసీలు దామోదర్, భారతి, అంజమ్మ, గిరమ్మ, సాయిభార్గవి, చెన్నమ్మ, ఇందిరమ్మ, వరలక్ష్మీ, కుర్మయ్య ఉన్నారు.

అమరచింత: స్థానిక పురపాలికలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ పాల్గొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంస్మరణ సభ నిర్వహించి నివాళులు అర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి. కమిషనర్ మహ్మద్ ఖాజా, తహసీల్దార్ చాంద్‌పాషా, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పెబ్బేరు: దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో గురువారం అమరవీరుల కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఎంపీపీ ఆవుల శైలజ, వైస్ ఎంపీపీ బాల్‌చందర్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ డా. నాగలక్ష్మి, మండల విద్యాధికారి జయరాములు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలం నాగసానిపల్లిలో సర్పంచ్ ఆంజనేయులు గ్రామస్తులతో కలిసి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యదర్శి జీవిత, ఉపాధ్యాయులు చిన్నరాములు, అంగన్‌వాడీ టీచర్ శశికళ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంతో పాటు ఆగారం, వెంకటాంపల్లి, అప్పారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో తెలంగాణ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, యువకులు అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఎంపీపీ కమలేశ్వర్‌రావు, తహసీల్దార్ పాండూనాయక్, ఎంపీడీఓ కతలప్ప, సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు మౌలాన్ బీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ, మండల వైద్యాధికారి వంశీకృష్ణ పాల్గొన్నారు.

గోపాల్‌పేట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట విద్యార్థులు పది సంఖ్య, తెలంగాణ బొమ్మ ఆకారం వచ్చేలా నిలబడ్డారు. మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ సంధ్య, జెడ్పీటీసీ సభ్యురాలు భార్గవి, సర్పంచ్ శ్రీనివాసులు, స్థానిక ప్రజాప్రతినిధలు, యువత పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్ళపల్లి శ్రీధర్‌రెడ్డి అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి మౌనం పాటించారు. మండలంలోని తెల్లరాళ్లపల్లిలో అమరుల స్తూపం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులు అర్పించారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పెబ్బేరు మండల పరిషత్ కార్యాలయంలో..



పెద్దమందడిలో మాట్లాడుతున్న మేఘారెడ్డి



ఖిల్లాఘనపురం మండలం వెంకటాంపల్లిలో..



కొత్తకోటలో అమరుల తల్లులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



వీపనగండ్లలో మాట్లాడుతున్న ఎంపీపీ కమలేశ్వర్‌రావు





అమరచింత పుర కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న కౌన్సిలర్లు, అధికారులు.. నాగసానిపల్లిలో..

సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం: సీపీఎం



కొంకనోనిపల్లెలో ఇంటింటి ప్రచారంలో సీపీఎం జిల్లా నాయకుడు వెంకటేష్, అజయ్

అమరచింత: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ఎందుకు విఫలమవుతున్నారో ప్రజాక్షేత్రంలో వెల్లడించాలని సీపీఎం మండల నాయకులు బి.వెంకటేష్ ,అజయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలంటూ గురువారం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీలు, సీసీ రహదారుల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. గృహలక్ష్మి పథకాన్ని రూ.మూడు లక్షల నుంచి రూ.అయిదు లక్షలకు పెంచాలని కోరారు. పట్టణంలోని దుంపాయికుంటలో 25 ఏళ్ల కిందట ఇంటి స్థలాల పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులు పొజీషన్ చూపాలంటూ పది నెలలుగా అక్కడే గుడిసెలు వేసుకొని జీవిస్తున్నా.. నేటికీ వారి సమస్యను పరిష్కరించకపోవడం దారుణమని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ధర్నాలో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం ప్రజాసంఘాల నాయకులు నర్సింహ, తరుణ్, శివ, శ్రీను, కృష్ణ, శ్యాంసుందర్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన

అమరచింత: పురపాలికలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోతే పుర కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ హెచ్చరించారు. పట్టణంలోని ఒకటోవార్డులో ఉన్న షాదీఖానా పరిసరాలను గురువారం ఆయన పరిశీలించారు. షాదీఖానా పరిసరాల్లో మురుగు నిలిచి దుర్వాసన వస్తోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వినియోగించుకోలేని దుస్థితి దాపురించిందని తెలిపారు. వీధిదీపాలు, తాగునీటి సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నా వార్డు కౌన్సిలర్ పట్టించుకోవడం లేదన్నారు. నాగులబావిలో మురుగు చేరి ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయని, దీంతో వార్డు ప్రజలు డెంగీ బారిన పడుతున్నా చైర్‌పర్సన్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.



మురుగు చూపుతున్న కుతుబ్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బీరం

పాన్‌గల్: మండలంలోని రేమద్దులకు చెందిన వెంకటమ్మకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అందజేశారు. సీఎం సహాయనిధితో పేద కుటుంబాలు కార్పొరేట్ స్థాయి ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోగలుగుతున్నట్లు పేర్కొన్నారు. చెక్కు మంజూరు చేసిన ఎమ్మెల్యే, కృషి చేసిన మండల ప్రజాప్రతినిధులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, పలకలు పంపిణీ

పాన్‌గల్: మండలంలోని కిష్టాపూర్‌తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తండావాసి దాసూనాయక్ రూ.12 వేల విలువైన ప్లేట్లు, పలకలు గురువారం పంపిణీ చేశారు. అలాగే తరగతి గదికి రంగులు వేయించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మురళి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. విద్యార్థులకు ప్లేట్లు, పలకలు అందించిన దాతను హెచ్‌ఎం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగరాజు, ఎస్‌ఎంసీ చైర్మన్ బావునాయక్, బీఆర్‌ఎస్ నాయకులు రమేష్, శశిధర్‌రెడ్డి, పీర్యానాయక్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్లేట్లు, పలకలు అందుకున్న విద్యార్థులతో దాత, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు

మండల రైతుసమితి కో–ఆర్డినేటర్ అలకపాన్పు

- బుజ్జగింపు పనిలో మండల నాయకులు

ఖిల్లాఘనపురం: మండల రైతుసమితి కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రావు గురువారం పార్టీని వీడుతున్నట్లు సంకేతాలు ఇచ్చారు. మండలంలోని మామిడిమాడ బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల నడుమ సఖ్యత కొరవడటం, అంతర్గత కలహాలతో మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న మండల నాయకులు రాళ్ల కృష్ణయ్య, లక్ష్మారెడ్డి, బాలీశ్వర్‌రెడ్డి తదితరులు వెంకటేశ్వర్‌రావును బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. ఆయనను మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి సింగిరెడ్డి వాసంతి దగ్గరకు తీసుకెళ్లి మాట్లాడించినట్లు సమాచారం.

పాతబస్టాండ్‌లో దుకాణాలు ఏర్పాటు చేయాలి

వనపర్తి: స్థానిక పాతబస్టాండ్ స్థలంలో చిరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ కోరారు. పాతబస్టాండ్ స్థలంలో ఏర్పాటు చేసిన చైనాబజార్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. శ్రీరంగాపూర్ మండలానికి చెందిన పలువురు యువకులు అఖిలపక్ష ఐక్యవేధికలో చేరినట్లు తెలిపారు. వారిలో మేకల అశోక్‌ను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రం అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, సత్యం, ఆనంద్, నగేష్, అశోక్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

గోపాల్‌పేట: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న జయన్న తిర్మలాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌ను సర్పంచ్ లక్ష్మీకళ గురువారం సన్మానించారు. బొక్కలయ్య, చంద్రయ్య, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్ : యువకుడికి గాయాలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవన సమీపంలో మలుపు వద్ద డివైడర్‌ను బైక్ ఢీకొని ఓ యువకుడు గాయాల పాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కేతేపల్లికి చెందిన మద్దిలేటి బైక్‌పై గ్రామం నుంచి వనపర్తికి వెళ్తుండగా పాన్‌గల్‌లో మలుపు వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో కిందపడి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించి జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి..

వనపర్తి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడిన ఘటన గురువారం సాయంత్రం మండలంలోని అంజనగిరి శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జిల్లాకేంద్రానికి చెందిన అరుణ్ పాన్‌గల్ నుంచి వనపర్తి వైపు వస్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. క్షతగాత్రుడిని 108 వాహనంలో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు.

26న డీవీ కృష్ణ వర్ధంతి



అమరచింత: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 26న డీవీ కృష్ణ ప్రథమ వర్ధంతి నిర్వహించనున్నట్లు ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు పి.అరుణ్ కుమార్ తెలిపారు. పట్టణంలోని మార్క్స్ భవనంలో గురువారం డీవీ కృష్ణ వర్ధంతి వేడుకల వాల్‌పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. డీవీ కృష్ణ 1969లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ఉద్యమ నిర్మాణానికి పూనుకున్నారని వివరించారు. నిజామాబాద్ జిల్లాలో బలమైన బీడీ కార్మిక సంఘం నిర్మాణానికి కృషిచేసి వారి హక్కుల కోసం పోరాడిన యోధుడని కొనియాడారు. వర్ధంతి వేడుకల్లో కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాజు, రాజన్న, సామ్యూల్, జిలాని, భక్తరాజ్, రాంచందర్, ఏసన్న పాల్గొన్నారు.

తవ్వకాలతో కుంటకట్టకు నష్టం



పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో ఉన్న గొల్లకుంటను అనుసరించి ఉన్న భూముల్లో తవ్వకాలు చేపడితే కట్టకు నష్టం వాటిల్లుతుందని సమీప పొలాల రైతులు మధుసూదన్‌రావు, సుదర్శన్, విష్ణువర్ధన్‌రావు, లక్ష్మయ్య, శేషయ్య, బాలయ్య, కుర్మయ్య తదితరులు గురువారం వాపోయారు. గతంలో చేపట్టిన తవ్వకాలతో కుంటకట్ట కొంతవరకు కోతకు గురైందని, ధ్వంసమైతే నీటినిల్వ తగ్గుతుందన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయగా ఇరిగేషన్ ఏఈ వెంకటేష్, ఆర్‌ఐ తిరుపతయ్య కట్టను పరిశీలించి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని సమాధానం ఇచ్చినట్లు వివరించారు. ఈ విషయాన్ని మైనింగ్ యజమాని జంగారెడ్డి వద్ద ప్రస్తావించగా.. 2006లో 230, 233, 234, 235, 251, 252 సర్వేనంబర్లలో తవ్వకాలకు మైనింగ్‌శాఖ నుంచి అనుమతి తీసుకున్నామని, ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు చేపడుతున్నట్లు వివరించారు. తమకు అనుమతి ఇచ్చినప్పుడు రికార్డులో కుంట లేదని.. గుట్ట ఉందని, అనుమతి పత్రాలను తహసీల్దార్‌కు అందజేసినట్లు పేర్కొన్నారు.

బహిరంగసభను జయప్రదం చేయండి : బీజేపీ



ఆత్మకూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



గోపల్‌దిన్నెలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో నాయకులు

ఆత్మకూర్: పట్టణంలోని శ్రీ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 29న సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే భారీ బహిరంగ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నారని.. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, నియోజకవర్గ కో–కన్వీనర్ రేచింతల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని వార్డుల్లో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని.. బీఆర్‌ఎస్ వైఫల్యాలను గడప గడపకు తీసుకెళ్తున్నామని, ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. తమ్మలి వెంకటేష్, భీంరెడ్డి, బాలకృష్ణ, సమద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్నివర్గాలకు సముచిత న్యాయం

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడే అన్ని వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందుతాయని బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి అన్నారు. 'మహాజన్ సంపర్క్ అభియాన్'లో భాగంగా గురువారం మండల కేంద్రంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని మండలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు ఇల్లిల్లూ తిరిగి ప్రధాని మోదీ 9 ఏళ్ల పాలనలో దేశంలో తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి, ప్రపంచంలో దేశానికి పెరిగిన విలువ తదితర విషయాలను ప్రజలకు వివరించడంతో పాటు కరపత్రాలు పంపిణీ చేశారు.

కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం

వీపనగండ్ల: బడుగుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం 9 ఏళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి అమలు చేసిందని బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడు శివాజీ అన్నారు. గురువారం మండలంలోని గోపల్‌దిన్నెలో నిర్వహించిన ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో బీజేపీ ప్రభుత్వాన్ని బలపరిస్తే రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరేష్ యాదవ్, మోహన్‌గౌడ్, జానకిరాం యాదవ్ పాల్గొన్నారు.

ఇంటింటికి కేంద్ర పథకాలు..

అమరచింత: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ప్రతి ఇంటికి చేరాయని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు తెలిపారు. బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేంద్ర పథకాలను వివరించారు. క్యామ భాస్కర్, అశోక్‌కుమార్, నరాల నారాయణ, ఎస్.వెంకటేశ్వర్లు, పారుపల్లి సురేష్, విష్ణు, జగన్నాథం, నర్సింహ, గొల్ల శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తకోట: పట్టణంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీ శివశంకర్‌రెడ్డి, ఏఈ నిస్సార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మదనాపురం రైల్వేస్టేషన్‌లో విద్యుత్ లైన్ల కోసం పనులు కొనసాగుతున్న నేపథ్యంలో కోత విధించామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భూ తగాదా కేసులో జరిమానా

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం జగత్‌పల్లిలో 2017, జూన్ 9న భూ వివాదంలో ఇరువర్గాలపై కేసు నమోదైంది. ఆరేళ్లుగా విచారణ జరిపిన న్యాయమూర్తి సునీత రెండువర్గాల వారికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున రూ.10 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించిందని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

ఇళ్ల స్థలాల పట్టాలు అందించాలి

వనపర్తిటౌన్: పట్టణంలోని చిట్యాల రోడ్‌లో ఉన్న సర్వేనంబర్ 312, 335లో 1997లో ఇళ్ల పట్టాలు పొందిన 221 మంది లబ్ధిదారులు తమ ప్రొసీడింగ్ జిరాక్స్‌లను తహసీల్దార్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్‌లో అందజేయాలని తహసీల్దార్ రాజేందర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.